ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 4 అక్టోబరు 2024 | 5



అమ్మా..భవానీ



విజయదుర్గా నమో..నమః

వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారు



శ్రీదేవి మాతా..

అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో..



ద్రాక్షారామంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ద్రాక్షారామ, అక్టోబరు 3: అష్టాదశ శక్తిపీఠాల్లో ద్వాదశ శక్తిపీఠంగా వెలుగొందుతున్న భీమేశ్వరాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వాడ్రేవు సుందర రత్నాకరరావు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ దేవులపల్లి ఫణిరామకృష్ణ బ్రహ్మత్వంలో వేద పండితులు గణపతి పూజ, కలశస్థాపన జరిపారు. మాణిక్యాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చన జరిగింది. అనంతరం సప్త హారతులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. వసంత మండపంలో బాలాత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ పాల్గొన్నారు. వెంకటేశ్వర ఇండస్ట్రీస్ అధినేత సుబ్బారెడ్డి ప్రసాద వితరణ జరిపారు.



మాణిక్యాంబ అమ్మవారికి విశేష పూజలు

రెవెన్యూ అంశాలపై అవగాహనతో ఉండాలి

వివిధ నివేదికలను సకాలంలో సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అంశాల పట్ల అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. అసైన్డ్ భూములు, భూ తనిఖీ రిజిస్ట్రేషన్ తదితర నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. అదనపు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి గురువారం అమరావతి నుంచి జిల్లాలోని జేసీలు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్, నీటి వినియోగదారుల సంఘాల ఆధీనంలో ఉన్న భూములు, జిల్లాస్థాయి మోనటరింగ్ అండ్ ఆడిట్ కమిటీల తనిఖీలు, లోకాయుక్త కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ నిషాంతి సమీక్ష నిర్వహించారు. భూ పరిపాలనా అంశాలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లాకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టులు రెండు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో సీసీఎల్యే కార్యాలయానికి పంపించాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాల వద్దనున్న భూములకు సంబంధించి నోటీసులు అందించాలన్నారు. సమాచార హక్కుచట్టం దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రిలే ఉత్తర్వులను ఇప్పటికే జారీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, మదన్‌మోహనరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు చినబాబు పాల్గొన్నారు.

అలా పెరిగి.. ఇలా తగ్గింది..



కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ధరలు

కొత్త కొబ్బరి (క్వింటాల్)	12,000
కొత్త కొబ్బరి (రెండవరకం)	10,000-10,500
కురిడీ కొబ్బరి(పాతవి)	
గండేరా(వెయ్యి)	17,000
గటగట(వెయ్యి)	15,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా(వెయ్యి)	15,500
గటగట(వెయ్యి)	14,500
నీటికాయ	
పాత(ముక్కుడు)(వెయ్యి)	14,000-15,000
కొత్త(పచ్చి) (వెయ్యి)	15,000-16,000

పడిపోయిన కొబ్బరి కాయల ధరలు

అంబాజీపేట, అక్టోబరు 3:

కొబ్బరి ధరలు పెరిగినట్టే పెరిగి వారం రోజుల్లోనే అమాంతంగా తగ్గిపోయాయి. కొబ్బరికాయల ధరలు వేయి రూ.20 వేలకు పైగా పెరుగుతుందని ఆశతో ఉన్న రైతుకు నిరుత్సాహం మిగిలింది. దసరా పండుగ సీజన్ ముగియడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గడంతో ఆ ప్రభావం కోనసీమ కొబ్బరి మార్కెట్ ధరలపై పడింది..

వారం రోజుల్లోనే కాయకు రూ.5 తగ్గుదల

ఇతర రాష్ట్రాల్లో వరదలు, వర్షాలతో తగ్గుతున్న ఎగుమతులు

సీజన్ ముగింపుతో ధరలు పతనం



తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కొబ్బరి కాయ దిగుబడి తగ్గడంతో మన రాష్ట్రంలోని కొబ్బరికాయ ధరకు మరింత డిమాండ్ పెరిగింది. గత నెలరోజులుగా హెచ్చు ధరలతో నిలదొక్కుకున్న కొబ్బరి మార్కెట్ ఒక్కసారిగా కిందకు పడుతోంది. గత నెలలో రూ.9 వేల నుంచి ప్రారంభమైన ధరల పెరుగుదల గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు ధర పలికింది. కొబ్బరికాయల ధరలు పెరగడంతో

వారం రోజుల్లో తగ్గింది..

ఇటు రైతులలోనూ..అటు వ్యాపారులలోనూ ఆనందం నెలకొంది. అయితే ఇప్పుడు ధరల తగ్గుదలతో వ్యాపారులు, రైతులలో ఆ సంతోషం కొన్ని రోజులకే పరిమితమైంది. కొందరు వ్యాపారులు పచ్చికొబ్బరి కాయల ధరలు పెరుగుతాయని ముందుగానే ఊహించుకుని రైతుల నుంచి భారీగా కొనుగోలు చేసుకున్నారు. కొందరు రైతులకు ముందుగా ఆయా కొబ్బరి వ్యాపారులు అడ్వాన్సులు అందించి కొబ్బరికాయను కొనుగోలు చేసుకున్నారు. అయితే ధరల పతనంతో ఆయా వ్యాపారులు నిరాశ చెందుతున్నారు.

సీజన్ ముగియడంతో..

దసరా సీజన్ ముగియడంతో ఈ ధరలు పతనమవుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే మార్కెట్‌లో పచ్చికొబ్బరికాయలు వేయి రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు కొనుగోలు చేసి వాటిని ఒలిచి ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు రూ.23 వేలు ఖర్చవుతుంది. అక్కడ రవాణా చార్జీలు, ఖర్చులతో అక్కడి చిల్లర వ్యాపారులు రూ.33 వేలకు కొనుగోలు చేయాలి. కానీ అక్కడ రూ.33 వేలకు కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కొబ్బరికాయలకు డిమాండ్ తగ్గిందంటున్నారు వ్యాపారులు. అలాగే పితృపక్షోత్సవాలు అమావాస్య ముగియడంతో ఇతర రాష్ట్రాలకు కాయల డిమాండ్ తగ్గింది. అలాగే నేపాల్, గుజారాజ్ వంటి రాష్ట్రాలలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. గత నెలలో రోజుకు 100 లారీలకు పైగా కొబ్బరి ఎగుమతులు కాగా ప్రస్తుతం 50 నుంచి 60 లారీలు మాత్రమే కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం బిహార్, కోల్‌కతా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. ఈ నెలలో వచ్చే దీపావళి పండుగతో పాటు కార్తీకమాసంలో కొబ్బరి ధరలు, ఎగుమతులు పెరుగుతాయని రైతులు, వ్యాపారులు ఆశిస్తున్నారు.

హైవేల విస్తరణ అభివృద్ధి పనులపై సమీక్ష

అభ్యంతరాల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-216 విస్తరణ అభివృద్ధి పనులపై వస్తున్న అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పాశర్లపూడి, మామిడికుదురులలో వచ్చిన అభ్యంతరాలపై ఆయన కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్షించారు. విస్తరణ పనులకు అడ్డంకిగా ఉన్న భవన నిర్మాణాల విలువల గణనలో వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయేమో పునఃపరిశీలన చేసి తాజాగా నివేదిక అందించాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, భూసేకరణ అధికారులు 2016 సంవత్సరంలో పాసైన అవార్డులకు, 2019లో పాసైన అవార్డులకు భూముల నష్టపరిహారం చెల్లింపులో వ్యత్యాసాలను, ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల కోరిక మేరకు గణించాలన్నారు. గెద్దాడలో రహదారి విస్తరణ పనులకు సంబంధించి బరియల్ గ్రౌండ్ స్థానే వేరే స్థలాన్ని కేటాయించి బరియల్ గ్రౌండ్ నిర్మించాలని ఆదేశించారు. శివకోడులో జలవనరుల శాఖ లాకు దెబ్బతినే అవకాశాలపై మరోసారి స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 5న ఆర్అండ్‌బీ కార్యదర్శి సమావేశానికి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవో కె.మాధవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, జలవనరులశాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై పోటీలు

అమలాపురం టౌన్, అక్టోబరు 3: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలతో పాటు విద్యార్థులను భాగస్వాములు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, అడిషనల్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం ఆధ్వర్యంలో కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోటీలు జరిగాయి. హెచ్ఎం కాశి గణసత్యనారాయణ, మాచిరాజు, సాయిరామ్ పోటీలను పర్యవేక్షించారు. ఆయా పోటీల్లో ఆర్ఎస్ఎస్‌బీ పవన్ (అయినవిల్లి), ఎం.కావ్య(రామచంద్రపురం), జి.సాయిశ్రీ (అమలాపురం), ఎస్.మైత్రి (రావులపాలెం), జి.గాయత్రి (అమలాపురం), పి.మంజుశ్రీ (అంబాజీపేట) విజేతలుగా నిలిచారు. వీరితో పాటు మిగిలిన పోటీల విజేతలకు డీఈవో కమలకుమారి సర్టిఫికెట్లు అందజేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈవో కమలకుమారి

కొత్తపేట ఆర్డీవోగా శ్రీకర్



కొత్తపేట, అక్టోబరు 3: కొత్తపేట ఆర్డీవోగా డి.శ్రీకర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఆర్డీవోగా పనిచేసిన ఈయన సాధారణ బదిలీలలో భాగంగా కొత్తపేటకు వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన జీవీవీ సత్యనారాయణకు జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వానపల్లిలో సీఎం గ్రామసభ హామీలకు పరిష్కారాలు చూపాలి

సమీక్ష నిర్వహించిన జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 3: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 23న కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఇచ్చిన హామీలు, స్వీకరించిన అర్జీలకు పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని ఆయాశాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించి శాఖల వారీగా పురోగతిపై ఆరా తీశారు. హామీల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలు, స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ విధానాలు, సీఎంవో కార్యాలయానికి సమర్పిస్తూ నకళ్లను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించాలని సూచించారు. ప్రతిరోజు సీఎం కార్యాలయానికి హామీల పరిష్కార స్థితిగతులపై నివేదిక సమర్పించాల్సి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు 29 వరకు ఉన్నాయన్నారు. వాటిలో రూ.10.30 కోట్లకు సంబంధించి 16 ఉపాధిహామీ పనులు ఉన్నాయన్నారు. మిగిలిన సమస్యలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాల్సి ఉందన్నారు. అసైన్డ్ భూముల్లో ఉన్న ఇసుకను జిల్లా స్థాయి ఇసుక కమిటీ ద్వారా సరఫరాపై టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నామని జేసీ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శంకరప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫెర్రీ పనిచేయక వర్రీ

కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవు మూతపడడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లడానికి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల ప్రజలతో పాటు, అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లే అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ 15న వరదల కారణంగా ఫెర్రీ రేవులో రాకపోకలు నిలిపివేశారు. వరదలు తగ్గినా నేటికి పునరుద్ధరించలేదు.

మూడున్నర నెలలుగా మూతపడిన కోటిపల్లి ఫెర్రీ రేవు

వరదలు, ఆపై ఇతర కారణాలతో మూత

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పట్టించుకోని అధికారులు

కె.గంగవరం, అక్టోబరు 3:



కోటిపల్లి ఫెర్రీలో రేవు దాటితే కేవలం పది నుంచి 15 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే చాలు జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు చేరుకోవచ్చు. ఇది రామచంద్రపురం, మండపేట నియోజకవర్గ ప్రజలకు చాలా సులభంగా ఉంటుంది. ఫెర్రీలో రాకపోకల లేకపోవడంతో ఏ పనిమీదనైనా జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే అటు బాలయోగి వారధి, ఇటు రావులపాలెం-జొన్నాడ వంతెన దాటి వెళ్లాల్సి వస్తుంది. దీని వల్ల సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల అదనపు ప్రయాణంతో పాటు సమయం వృధా అవుతుంది. తరచూ జిల్లా కేంద్రంలోని వివిధ కార్యాలయాలకు, వివిధ పనులపై వెళ్లే అధికారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జూలై నెలలో గోదావరి నదికి వరదలు వచ్చాయి. గోదావరి ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడం ధవళేశ్వరం బ్యారేజీకి వరద నీరు చేరింది. అక్కడ నుంచి సముద్రంలోకి వదిలిన వరద నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహించింది. ఈ కారణంగా 15 జూలై, 2024న కోటిపల్లి ఫెర్రీలో రాకపోకలు నిలిపివేశారు. తర్వాత గోదావరి ఒకసారి తగ్గుతూ, మరల పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం గోదావరి తగ్గింది. ఈ తరుణంలో ఫెర్రీలో సుంకాలు వసూలుకు మండల పరిషత్ అధికారులు టెండర్లు పిలిచి, రేవు నిర్వహణ అప్పగించడానికి ప్రయత్నాలు చేశారు. అయితే సోమవారం జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా పడింది. దీంతో రేవులో రాకపోకలు ఎప్పుడు పునరుద్ధరిస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. బహిరంగ వేలం నిర్వహించకపోయినా, ప్రత్యామ్నాయ మార్గాల్లో రేవు నిర్వహణ చేసి ఫెర్రీలో రాకపోకలు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



బాలాత్రిపురసుందరిగా తలుపులమ్మ అమ్మవారు

కాకినాడ జిల్లా తుని సమీపంలోని తలుపులమ్మ లోవలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలిరోజున శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో అభయమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- తుని రూరల్



బాలాత్రిపురసుందరిగా మాణిక్యాంబ అమ్మవారు

ద్వాదశ శక్తి పీఠమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారికి ఉదయం లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం శ్రీచక్రనవావరణార్చన, సాయంత్రం ప్రదోషకాలార్చన, ధూప సేవ, పల్లకి సేవ, సువర్ణ, రజత పుష్పాలతో అర్చన జరిపారు. సప్త హారతులు ఇచ్చారు. వసంత మండపంలో అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- ద్రాక్షారామ



పాదగయలో రాజరాజేశ్వరి అలంకారంలో...

కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరీదేవి తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురుహూతికాదేవికి శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన జరిగాయి.

- పిఠాపురం



సామర్లకోటలో బాలాత్రిపురసుందరిగా...

పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా సర్వాంగసుందరంగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దేవీ వైభవం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రాలైన ద్రాక్షారామ, పిఠాపురం, సామర్లకోట, తలుపులమ్మ లోవ, అన్నవరం ఆలయాల్లో అమ్మవార్లు తొలిరోజైన గురువారం పలు అవతారాల్లో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో 91వ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. బాలాత్రిపురసుందరి అమ్మవారికి అర్చక స్వామి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇస్తున్న దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు.



విద్యుద్దీపాల వెలుగులో దేవీచౌక్

దేదీప్యమానంగా దేవీచౌక్

మిరుమిట్లు గొలిపిన విద్యుద్దీపాలంకరణలు

స్వర్ణకవచ కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



అమ్మవారికి పూజ చేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరీదేవి 91వ శరన్నవరాత్రి మహోత్సవాలను ఉత్సవ కమిటీ లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ఉదయం 8.40 గంటలకు కలశస్థాపన చేశారు. కుంకుమ పూజల అనంతరం, మంగళ వాయిద్యాల నడుమ అఖండ హారతి ఇచ్చారు. నాలుగు లాంతర్ల సెంటరుగా ఉన్న దేవీచౌక్‌లో బత్తుల వంశస్తులు బాలాత్రిపురసుందరీదేవిని ప్రతిష్ఠించిన నాటి నుంచి ఈ కూడలికి దేవీచౌక్‌గా ప్రజలే నామకరణం ప్రజలే చేశారు. 90 ఏళ్లగా అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలను క్రమం తప్పకుండా చేస్తున్నారు. తొలిరోజు అమ్మవారు స్వర్ణకవచ కనదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పది గంటలకు కనకదుర్గ మహత్యం నాటకం ప్రదర్శన జరిగింది. ఇక్కడ కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. విజయవాడ కనకదుర్గమ్మతల్లి ఆలయ శిఖరం ఆకారంలో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. దశావతారాలు, సీతారాములు, గణపతి, లక్ష్మీదేవి అయ్యప్ప స్వామి భారీ సెట్టింగులు, వెంకటేశ్వర స్వామి, విష్ణుమూర్తి విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





అన్నపూర్ణాదేవి రూపంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు, సామూహిక కుంకుమార్చనలో భక్తులు

శ్రీపీఠంలో మహా శక్తి యాగం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే మహా శక్తి యాగం మహా క్రతువు వేలాది మంది భక్తుల నడుమ గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఒకే రకమైన ఎరువు రంగు దీక్షా వస్త్రాలను ధరించిన మహిళలు శతకోటి కుంకుమార్చనలో అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఐశ్వర్యాంబిక, పార్వతి పరమేశ్వర, అమ్మ దుర్గాదేవి పాహిమాం అంటూ భక్తుల నామస్మరణతో శ్రీపీఠం పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. వేద పండితులు విఘ్నేశ్వర పూజ, సంకల్పం, అధిష్టాన దేవతల హోమం, స్వాహాకర బగళాముఖి జపాత్మక హోమం, శతకోటి కుంకుమార్చన, రెండుసార్లు లలితా సహస్రనామం, ఒకసారి దేవీ ఖడ్గమాలను భక్తులతో జపింపచేశారు. మహాశక్తి యాగం విశిష్టతను స్వామీజీ భక్తులకు వివరించారు. సాయంత్రం లక్ష పుష్పార్చన వైభవంగా జరిగింది. తొలిరోజు సుమారు 28వేలు మంది భక్తులు పాల్గొన్నారు. కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నేతృత్వంలో సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, టౌన్ సీఐలు కృష్ణ, సునీల్, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మహాశక్తి యాగ క్రతువును వివరిస్తున్న పరిపూర్ణానంద సరస్వతి స్వామి



బాల అలంకారంలో వనదుర్గ

రత్నగిరిపై ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు



ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనివేటి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించారు. ఉదయం 8 గంటలకు ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మంటపారాధన నిర్వహించారు. రుత్వికులకు దీక్షా వస్త్రాలను చైర్మన్ రోహిత్ అందజేశారు. అనంతరం దర్బారు మండపంలో చండీ సప్తసతి పారాయణ, సూర్యనమస్కారాలు, నవావరణార్చన, లింగార్చన, బాల గాయత్రి జపం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో కుంకుమార్చనలు జరిపారు. తొలిరోజున వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు బాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

రూ.1.08 కోట్లు

బంగారం 19 గ్రాములు, వెండి 735 గ్రాములు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు టీవీఎస్ ప్రసాద్, ఎన్వీఎస్వీ ప్రసాదరాజు సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.90,26,494, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.18,63, 141... మొత్తం రూ.1.08 కోట్లు ఆదాయం వచ్చింది. 35 రోజులకు బంగారం 19 గ్రాములు, వెండి 735 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించాయని ఉప కమిషనరు, ఈవో నల్లం చక్రధర రావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,36,510 లభించింది. లెక్కింపులో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు 'శ్రీప్రకాష్'లో ప్రారంభమైన

వాలీబాల్ చాంపియన్‌షిప్



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

దివాన్‌చెరువు, అక్టోబరు 3: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 110 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 1400 మందికి పైగా క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, తూర్పు గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు యశ్వంత్ (జెస్సీ), సీబీఎస్ఈ పరిశీలకుడు కిషోర్‌కుమార్ హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని విజయ్‌ప్రకాష్, సీబీఎస్ఈ పతాకాన్ని కిషోర్‌కుమార్, పాఠశాల పతాకాన్ని యశ్వంత్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజయప్రకాష్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల సామాజిక నైపుణ్యాలు వృద్ధి చెందడంతో పాటు క్రీడా నైపుణ్యాలు నేర్చుకునేందుకు వీలవుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



తుని రూరల్: కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యా సంస్థలల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. బాలికల విభాగంలో అండర్ -14, 17, 19 విభాగాల్లో సుమారు 1,200 మంది విద్యార్థినులు నువ్వా నేనా అన్న రీతిలో తలపడుతున్నారు. శుక్రవారం పోటీలు ముగుస్తాయని, అనంతరం విజేతలకు హోం మంత్రి వంగలపూడి అనిత బహుమతులు ప్రదానం చేస్తారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

విజయ డెయిరీ నుంచి

తాత్కాలికంగా నెయ్యి కొనుగోలు

» 15 రోజులకు 7వేల కిలోలు » కిలో రూ.640 చొప్పున ఆర్డర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అన్నవరం, అక్టోబరు 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ప్రసాదం తయారీకి 'నిండుకుంటున్న నెయ్యి నిల్వలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం వచ్చిన కథనంతో అన్నవరం దేవస్థానం అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు విజయ డెయిరీ నుంచి నెయ్యిని తాత్కాలికంగా కొనుగోలు చేయాలని వారు నిర్ణయించారు. 15 రోజులకు అవసరమయ్యే 7వేల కిలోల నెయ్యిని కిలో రూ.640 చొప్పున కొనుగోలు చేసేందుకు విజయ డెయిరీకి గురువారం ఆర్డర్ పెట్టారు. ఒకట్రెండు రోజుల్లో నెయ్యి ఆలయానికి చేరుతుందని అధికారులు వెల్లడించారు.

కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 3: పుష్కర కాలువలో పడి గల్లంతైన బాలుడి మృతదేహం గురువారం లభ్యమైంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పనబోయిన సతీష్ (15) బుధవారం బహిర్భూమికి అని బయటకు వెళ్లి పుష్కర కాలువలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం బాలుడి మృతదేహాన్ని స్థానికులు, గజ ఈతగాళ్లు వెలికితీశారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ వున్నా ఆదరించేవారు లేక

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

నిలువరించి పోలీసులకు అప్పగించిన స్థానికులు

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలింపు



వృద్ధురాలిని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న త్రీటౌన్ పోలీసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: ఇద్దరు కుమారులు, పెద్ద కుటుంబం ఉన్నా ఆదరించే వారు లేక 75 ఏళ్ల వృద్ధురాలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవుకు చేరుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనను చూసిన స్థానికులు అడ్డుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నానికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిని పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి ఇద్దరికి ఇళ్లు కట్టించి ఇచ్చారు. మూడేళ్ల క్రితం భర్త మరణించాడు. కుమారుల్లో ఒకరు మరణించగా అతని కుమార్తెను పెంచి తాను ఉంటున్న ఇంటిని ఆమెకు ఇచ్చేసింది. దీనిని తప్పుగా భావించిన మిగిలిన ఇద్దరు కుమారులు, కోడళ్లు వారి ఇళ్ల వద్ద నాగరత్నం ఉండడానికి ఇష్టపడలేదు. దీంతో ఆమె పెన్షన్ సొమ్ముతో జీవిస్తోంది. వయోభారంతో శరీరం పనిచేయకపోవడంతో కుమారులను ఆశ్రయం అడగ్గా వారు ఒప్పుకోలేదు. దీంతో చూసే దిక్కులేక కట్టుబట్టలతో గురువారం ఇల్లు వదిలి బస్సు ఎక్కి రాజమహేంద్రవరం చేరుకుంది. పుష్కరాల రేవు వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని వెళ్తుండగా స్థానిక చిరు వ్యాపారాలు రక్షించి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో ఆమె తన బాధను పోలీసులకు చెప్పుకుంది. వారు వృద్ధురాలిని లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలించారు. నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇక్కడ ఉన్న 30 మందితో నాగరత్నం కలిసి ఉండటం వల్ల ఒంటరిననే ఫీలింగ్ పోతుందన్నారు. బంధువులు వస్తే పోలీసుల ద్వారా వారికి అప్పగిస్తామని చెప్పారు.

రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలు

కాకినాడ జిల్లా ఏటీడబ్ల్యు స్థాయి అధికారికి

వివాదాస్పదంగా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు

రంపచోడవరం, అక్టోబరు 3: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఉత్తర్వులతో పాడేరు నుంచి రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చిన ఓ అధికారిని తప్పించి కాకినాడ జిల్లాలోని దిగువ అధికారి ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గిరిజన సంక్షేమ డైరెక్టర్ వివాదాస్పద ఉత్తర్వులిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ ఆదేశాలతో ఐ.కొండలరావు రంపచోడవరం గిరిజన సంక్షేమ డీడీగా పాడేరు నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన్ను తప్పించి సహాయ గిరిజన సంక్షేమ అధికారి హోదాతో కాకినాడ జిల్లాలో పని చేస్తున్న ఓ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వివాదమై అల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమ పాలనా వ్యవహారాలు గందరగోళంగా మారి గత వైసీపీ ప్రభుత్వ పోకడలనే తలపిస్తున్నాయి.

పాడేరులో అక్కడి వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదు నేపథ్యంలో డీడీని రంపచోడవరం బదిలీ చేశారు. సాధారణంగా ఐటీడీఏలకు చైర్మన్‌గా ఉండే కలెక్టర్లు తీసుకునే నిర్ణయాలను గిరిజన సంక్షేమ డైరెక్టర్లు సమర్థిస్తూ పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ఇక్కడ మాత్రం కలెక్టరు ఉత్తర్వులతో బాధ్యతలు నిర్వర్తిస్తున్న డీడీని తప్పించి ఓ సహాయ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడమే వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లాలో రెండు ఐటీడీఏలకు అనుబంధంగా కీలకమైన గిరిజన సంక్షేమ డీడీ పోస్టులను గ్రూప్-1 స్థాయికి తగ్గించేశారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తమ స్థాయి కంటే దిగువన ఉండే సహాయ గిరిజన సంక్షేమాధికారులకు డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడమేమిటని పలువురు ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. సీనియర్లైన తమను కాదని జూనియర్లకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని మరికొందరు సహాయ గిరిజన సంక్షేమాధికారులు విమర్శిస్తున్నారు. ఇంకొందరైతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

పింజరికొండ గ్రామానికి బ్రిడ్జి మంజూరుకు చర్యలు

అడ్డతీగల మండలంలో శిశువుతో కలిసి బాలింత ఏరు దాటిన ఘటనపై స్పందించిన ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి, అక్టోబరు 3: అడ్డతీగల మండలంలో గత నెలలో గిరిజన బాలింత శిశువుతో కలిసి ప్రమాదకరంగా ఏరు దాటిన ఘటనపై ప్రభుత్వం స్పందించింది. రాజవొమ్మంగి మండలంలోని గింజర్తి గ్రామంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజనులు ప్రమాదకరంగా వాగులు దాటి ప్రాణాలు కోల్పోతున్నా గత పదేళ్లగా ఎవరూ స్పందించట్లేదన్నారు. పింజరికొండ గ్రామానికి వెళ్లేందుకు బాలింత, శిశువును కుటుంబీకులు తీసుకుని ప్రమాదకర స్థితిలో వాగు దాటుతున్న వైనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిలకు తెలియజేయడంతో వారు వెంటనే స్పందించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.81లక్షలతో అంచనా కాపీని ఇప్పటికే సిద్ధం చేశామని ఎమ్మెల్యే శిరీషదేవి తెలిపారు. ఈ ఘటన జరిగిన గ్రామం ఎమ్మెల్సీ అనంతబాబు సొంత మండలంలోనిది అన్నారు. అయినా గత ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆత్రేయపురం, అక్టోబరు 3: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరుపున మెర్లపాలెంజడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని చింతల అనూష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే జిల్లా స్థాయిలో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను సర్పంచ్ మెర్ల రాము, పాఠశాల చైర్మన్ ముప్పల లక్ష్మీనారాయణ, హెచ్ఎం శ్రీహరి, పీడీ శ్రీకాంత్ అభినందించారు.

- పలు రూపాల్లో అమ్మవారు దర్శనం
- అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు
- విద్యుత్‌దీపాలు, పూలతో ఆలయాలు అలంకరణ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


యానాం, పి.గన్నవరం, మామిడికుదురు, ముమ్మిడివరం మండలాల్లో విశేష అలంకరణల్లో అమ్మవార్లు

అమలాపురంటౌన్, అక్టోబరు 3: దేవీ శరన్నవరాత్రులు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆలయాలతో పాటు అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీవైష్ణవికనకదుర్గమ్మ భక్తులకు శ్రీస్వర్ణ కవచాలంకృత కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పెద్దింటి సత్యవెంకట అనంతకృష్ణ సాయిదీక్షితులు అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారిని గంగాబత్తుల వీరవెంకటసత్యనారాయణ-రత్నకుమారి దంపతులు శ్రీస్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా విశేష అలంకారం జరిపించారు. డి.శ్రీనివాససిద్ధాంతి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ జరిపారు. బోనం రామకృష్ణ(చంటి) జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అమలాపురం మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పచ్చిగోళ్ల రామకృష్ణ దంపతులు వెండి పల్లకీని బహూకరించారు. తొలుత స్థానిక గడియారస్తంభం సెంటర్‌నుంచి 108మంది ఆర్యవైశ్య మహిళలు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీవాసవీమాతను కొత్తలంక సుధాకరశర్మ, నాగరాజుశర్మ ఆధ్వర్యంలో తొలిరోజు శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవిగా విశేష అలంకారం జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, యెండూరి వెంకట్రామయ్య నంబూరి నరేష్, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, వరదా సూరిబాబు పాల్గొన్నారు. బండారులంక చాముండేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పిచ్చిక యోగనాగేశ్వరరావు-మహాలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ జరిపారు. కామనగరువు ఆదిత్య పాఠశాలలో గురువారం దసరా ఉత్సవాలను ప్రిన్సిపాల్ రామప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సుధ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు నవదుర్గల వేషధారణలతో ఆకట్టుకున్నారు. మహిషాసుర సంహార ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. విజయదశమి విశిష్టతను ప్రిన్సిపాల్ రామప్రసాద్ వివరించారు. విద్యార్థులు చెడీతాలింఖానా ప్రదర్శన చేశారు. విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ చలపతిరావు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

రాజోలు: మండలంలోని పలు గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తాటిపాక, శివకోటి, కడలి, పొన్నమండ, వేగివారిపాలెం, మెరకపాలెం, సోంపల్లి తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు జరిపించుకున్నారు.

అంబాజీపేట: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి కలశ స్థాపనలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పార్కు వద్ద కనకదుర్గ ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కొత్తూరు జోడుతూముల వద్ద కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు. కుంకుమపూజలు, విశేష పూజలు నిర్వహించారు. సరస్వతి అమ్మవారు జ్ఞాన సరస్వతిగా దర్శనమిచ్చారు.

ముమ్మిడివరం: దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మవారి ఆలయాల వద్ద కలశస్థాపనచేసి ఉత్సవ విగ్రహాలను నిలిపి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి చలువ పందిళ్లు వేశారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడివరంలోని విళ్ల ఈశ్వరమ్మ ఆలయంలోని శ్రీవిజయదుర్గమ్మవారికి విళ్ల ఈశ్వరరావు-మాధవి దంపతులు, విళ్ల గణేశ్వరరావు-సౌజన్య, గణేశుల బ్రహ్మానందం దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రాపచింతలపూడి, గేదెల్లంక, అన్నంపల్లి, గాడిలంక, అయినాపురం, మహిపాలచెరువు, అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, కొత్తలంక తదితర ప్రాంతాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముమ్మిడివరం హైస్కూలు సెంటర్‌లోని శ్రీవిజయదుర్గాంబిక ఆలయం వద్ద యువజన వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గా అమ్మవారు తొలి రోజు శ్రీబాలాత్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమించారు. తొలుత విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత గాడ్ కుమార్తె గాదే సత్యవెంకటకామేశ్వరి ఉదయం 8.19గంటలకు అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపన చేసి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వెయ్యికిపైగా భక్తులు పీఠంలో కలశాలు స్థాపించి అమ్మవారికి సామూహిక శ్రీచక్ర అర్చనలు చేశారు. పీఠాధిపతి గాడ్ భక్తులకు శరన్నవరాత్రి ఉత్సవాలు విశిష్టతను భక్తులకు వివరించారు. సాయంత్రం అమ్మవారికి చతుర్వేదస్వస్తి, దర్బారుసేవ, నీరాజనమంత్రపుష్పాలు, మహనివేదన జరిపారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఠం వీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

మలికిపురం: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో గురువారం ఉదయం కలశస్థాపనతో అమ్మవారిని నిలబెట్టారు. ప్రత్యేక కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మామిడికుదురు: శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో కలశస్థాపనచేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మామిడికుదురు, పాశర్లపూడి బాడవ, పెదపట్నంలంక, మగటపల్లి, పెదపట్నం, నగరం, ఈదరాడ తదితర గ్రామాల్లో కుంకుమార్చన పూజలు ఘనంగా చేశారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మవారు గురువారం శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రావులపాలెం: దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో, రావులపాలెం కాలువగట్టు చెంతనే ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆత్రేయపురం: శరన్నవరాత్రి వేడుకలు వాడవాడలా గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. వాడపల్లి విజయదుర్గ దేవిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100మంది భవానీమాల దీక్ష చేపట్టారు. ఉచ్చిలి విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. వివిధ రూపాలలో అమ్మవార్ని అలంకరించనున్నారు. గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

పి.గన్నవరం: పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మ శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పుల్లెటికుర్తి ఫణి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. నవరాత్రులు తొమ్మిది రోజులు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని శ్రీవినాయక యువజన సంఘం సభ్యులు తెలిపారు.

కె.గంగవరం: కుందూరులో విజయదుర్గఅమ్మవార్ని కార్మిక శాఖ మంత్రి వాంసశెట్టి సుభాష్ దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కూటమి నాయకులు పామర్తి బాబి, మేడిశెట్టి బాబి, జగతా రమణ, సుంకర రాంబాబు, పళ్ల చినబాబు, సుంకర శ్రీను, కొరిపెల్ల సురేష్ పాల్గొన్నారు. గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో శరన్నవరాత్రి ప్రారంభ పూజలు ఘనంగా నిర్వహించారు. కొన్నిచోట్ల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటుచేసి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు.

కపిలేశ్వరపురం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం మండలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి.కపిలేశ్వరపురం, అంగర, పడమరఖండ్రిక, టేకి, కోరుమిల్లి, కాలేరు, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, నల్లూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద దుర్గాదేవికి అభిషేకాలు, కుంకుమ, పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భవానీ దీక్షా దారులు, మహిళలతో ఆలయాలు కిటకిటలాడాయి.

అంతర్వేది: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అనుబంధ దేవాలయం స్వామివారి సోదరి శ్రీఅశ్వరూడాంబిక (గుర్రాలక్కమ్మ అమ్మవారు) అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండలంలో శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయాల వద్ద దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయాల వద్ద కలశస్థాపన చేసి భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద భజనా కాలక్షేపాలు, భక్తి గీతాలు ఆలపించారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరి, వీవీ మెరక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గొంది, అంతర్వేది దేవస్థానం చెరువు వద్ద ఉన్న ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

యానాం: యానాం శివారు గిరియాంపేట రోడ్డులో శ్రీపాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారు శ్రీపాలకనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి(సరస్వతి) ఆలయంలో అమ్మవారు, శివాలయ ప్రాంగణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపురసుందరి అమ్మవారిగా దర్శనమిచ్చారు.

అల్లవరం: మండలంలోని పలు దుర్గాలయాల్లో కలశ పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అల్లవరం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, మొగళ్లమూరు, గోడిలంక, డి.రావులపాలెం, కోడూరుపాడు, యెంట్రుకోన, వాసర్లవారిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కుటుంబ సమేతంగా దుర్గాదేవి అమ్మవార్లను భక్తులను దర్శించుకున్నారు.

నిధుల వినియోగం, నిల్వలపై నిలదీత


భీమనపల్లి పీహెచ్‌సీ వ్యవహారంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంపై వైద్యాధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ నాగరత్నకుమారి

ఉప్పలగుప్తం, అక్టోబరు 3: మూడేళ్ల కాలంలో మండల ప్రజాపరిషత్ నిధుల వినియోగంపై లెక్కలు, భీమనపల్లి పీహెచ్‌సీలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలపై భీమనపల్లి-1 ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి వివరాలు కోరడంతో సర్వసభ్య సమావేశంలో వాదోపవాదాలు జరిగాయి. ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన గురువారం జరిగిన మండల సమావేశంలో నిధుల వినియోగంపై ఎంపీటీసీ రత్నకుమారి ప్రశ్నించారు. మూడేళ్లలో భీమనపల్లి-1కు కేవలం రూ.4లక్షలు ఇచ్చారని, అందరికీ అలాగే చేశారా? లేక తేడాలున్నాయా అని ప్రశ్నించారు. నిల్వ రూ.13లక్షలు మాత్రమేనని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంఎల్ఎన్ మూర్తి జవాబిచ్చారు. నిల్వ తక్కువ చూపిస్తున్నారని, వేటికి ఎంత ఖర్చు చేశారో లెక్కలు ఇవ్వాలని కుమారి డిమాండ్ చేశారు. భీమనపల్లి పీహెచ్‌సీలో ఇటీవల ప్రసవం అనంతరం శిశువు చనిపోయిందని ఉన్నతాధికారులు కనీసం ఆసుపత్రికి వచ్చి పరిస్థితులపై ఆరాతీసిన దాఖలాలు లేవన్నారు. పీహెచ్‌సీలో ఈసంఘటనపై సమీక్ష నిర్వహించారని పీహెచ్‌సీలో ఎటువంటి లోపం జరగలేదని ఎంపీపీ చెప్పారు. నాడు-నేడులో 32 పాఠశాలలకు కేవలం రెండు పాఠశాలలు మాత్రమే పూర్తయినట్టు ఎంఈవో సత్తి సత్యకష్ణ సభ్యుల ప్రశ్నకు సమాధానమిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన మెనూలో మార్పులు చేయనున్నట్టు ఆయన వివరించారు. మండలంలో వర్షానికి దెబ్బతిన్న పంటలకు రూ.61.80లక్షలు పరిహారం రైతుల ఖాతాల్లో వేసినట్టు వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు తెలిపారు. దసరా సెలవుల అనంతరం ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తానని జడ్పీటీసీ గెడ్డం సంపదరావు చెప్పారు. నవంబరు నెలాఖరు వరకు విషజ్వరాల వ్యాప్తికి అనుకూల పరిస్థితున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి లంకే నాగార్జున సూచించారు. ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారుల గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నంగవరం హెల్త్ సెంటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకపోవడంపై సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, వైద్యాధికారి నాగార్జున మధ్య వాగ్వివాదం జరిగింది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన


ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్ష విభాగ ఉద్యోగులు

ముమ్మిడివరం, అక్టోబరు 3: సమగ్రశిక్ష అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండుచేస్తూ జిల్లాలోని సమగ్రశిక్ష ఉద్యోగులంతా గురువారం నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని సమగ్రశిక్ష ఉద్యోగులంతా కాశివానితూము సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి అక్కడి నుంచి ర్యాలీగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. జిల్లా చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బి.శ్రీనివాస్, వి.వెంకటరమణ, బి.జాన్‌బాబు, జె.గౌతమ్‌ప్రసాద్, ఎస్‌కే రహ్మాన్, కె.వెంకటేశ్వరరావు, ఎం.అనూష, ఆర్.రమాదేవి, పండు వెంకటేశ్వరరావు, ఎస్.గంగాధర్, సునీత పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని నిరసన దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, అక్టోబరు 3: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక, ప్రజా, విద్యార్థి, రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు సందర్శించి మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించి ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా పూర్వపు అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు సందర్శించి మాట్లాడారు. శిబిరంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, వివిధ సంఘాల నాయకులు పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామమూర్తి, పొలమూరి శ్రీనివాసరావు, జి.దైవకృప, టి.నాగవరలక్ష్మి, అమీదా, బి.వెంకటలక్ష్మి, కుడుపూడి వెంకటలక్ష్మి, కె.శంకర్, జి.శశి, జె.సంతోష్, జె.నవ్యశ్రీ, ఊడాల వెంకటేష్, నిమ్మకాయల శ్రీనివాసరావు, వి.దొరబాబు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 3: న్యాయవాదుల చట్టసవరణలు వ్యతిరేకిస్తూ గురువారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. చట్ట సవరణలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టసవరణలతో బార్‌కౌన్సిళ్ల అస్థిత్వం, స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు టి.చలపతి, లకాని పద్మకమలకుమారి, కె.వి.వి.సత్యనారాయణ, కె.లోవరాజు, గాలింకి చిట్టిబాబు, చోడే జాన్‌రత్నం, దొమ్మలపాటి సత్యనారాయణ, నేలపాటి వీరభద్రరావు, మండ సత్తిరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారంతో చండీహోమాలు

ఐ.పోలవరం, అక్టోబరు3: దసరా నవరాత్రుల సందర్భంగా మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పది రోజులు దాతల సహకారంతో చండీహోమాలు నిర్వహిస్తున్నట్టు ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. పూర్ణాహుతిలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొంటారని అన్నారు. అదేరోజు భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

స్టూల్స్ బహూకరణ

ఐ.పోలవరం, అక్టోబరు 3: వీరేశ్వరస్వామి ఆలయానికి ముమ్మిడివరానికి చెందిన భక్తుడు దేవత వీరవెంకటసత్యనారాయణసాయినాథ దంపతులు స్టూల్స్ బహూకరించారు. వీరేశ్వరస్వామి కళ్యాణం తిలకించేందుకు వచ్చే వృద్ధులకు ఈస్టూల్స్ ఉపయోగపడతాయి. దాతలను ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

విలసలో పొలం పిలుస్తోంది

అయినవిల్లి, అక్టోబరు3: విలసలో గురువారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎరువులు, పురుగు మందుల వినియోగం, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఆత్మ ఏడీఏ రాజశేఖర్, ఏవో మనోహర్, మండల వ్యవసాయాధికారి వై.శోభ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లకు విద్యుత్ సదుపాయం ఎలా కల్పిస్తారు?

మామిడికుదురు, అక్టోబరు3: మండలంలోని అనధికార లేఅవుట్లకు విద్యుత్ సదుపాయాన్ని ఎలా కల్పిస్తారని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కుసుమ వనజాకుమారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాశర్లపూడి సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి నాగరాజు మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా అనధికార లేఅవుట్లలో నిర్మించిన భవనాలకు ఏవిధంగా విద్యుత్ మీటర్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు బాధపడుతున్నారని, సమస్య పరిష్కరించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలను చర్చించకుండా మండల పరిషత్ నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు ఆరోపించారు. గ్రామాల్లోని పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏవో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య, వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మీ పాల్గొన్నారు.

రెండు రోజులు బస్‌పాస్‌లు నిలుపుదల

అమలాపురంటౌన్, అక్టోబరు3: విద్యార్థులతో పాటు ఇతర అన్నిరకాల బస్‌పాసులను ఈనెల5,6 తేదీల్లో నిలుపుదల చేసినట్టు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ కారణంగా బస్ పాస్‌లను నిలుపుదల చేశామని, ఈనెల7నుంచి యథావిధిగా కౌంటర్లలో బస్‌పాస్‌లు అందిస్తామని తెలిపారు.

జనసేనలోకి కల్వకొలను తాతాజీ



అమలాపురంటౌన్, అక్టోబరు3: సీనియర్ నాయకుడు కల్వకొలను తాతాజీ కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పంపించారు. మూడు దశాబ్దాలుగా పార్టీలో పలు పదవులు నిర్వహించారు. త్వరలో జనసేనలో చేరతారని తెలిసింది.

మాకొద్దీ డంపు.. మాకొద్దీ కంపు

అమలాపురం రూరల్, అక్టోబరు 3: బండారులంక లోయర్‌కౌశిక డ్రెయిన్‌ను ఆనుకుని ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డును తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ గురువారం గ్రామస్థులు నిరసన తెలిపారు. మాకొద్దీ డంపు.. మాకొద్దీ కంపు అంటూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని అప్పటివరకు చెత్తను సరఫరా చేసే ట్రాక్టర్లను అడ్డుకుంటామని ముందుగానే హెచ్చరించారు. నిరసనలో దైవపు పూర్ణిమ, చింతా మణి, కొండా మల్లి, బిళ్ల లక్ష్మి, కొండా సూర్యకుమారి, బండారు నాగలక్ష్మి పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	స్వాగ్
శ్రీలలిత	సెలబ్రిటి
శేఖర్ స్క్రీన్-1	రామనగర్‌లో బన్నీ
శేఖర్ స్క్రీన్-2	దక్షిణ
రమా	దేవర-1
గణపతి	మత్తువదలరా-2
వెంకటపద్మావతిస్క్రీన్-1	దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	సత్యంసుందరం

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కొత్తపేట, అక్టోబరు 3: రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏవో పద్మలత సూచించారు. గురువారం పలివెల, గంటి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో సమస్యలకు తక్షణ పరిష్కారాలు సూచించారు. సర్పంచ్ సాగి బంగార్రాజు, ముదునూరి రామలింగరాజు, బి.వీర్రాజు, ధిరసాల తాతారావు, కుడుపూడి సత్యనారాయణ, చీకట్ల నరసింహమూర్తి, ముత్తాబత్తుల బుజ్జిబాబు పాల్గొన్నారు.

రూ.5కోట్ల ర్యాపిడ్ ఫిల్టర్ ప్రాజెక్ట్ మంజూరు

మలికిపురం, అక్టోబరు 3: రాజోలు నియోజకవర్గంలో రూ.5కోట్లతో ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ వాటర్ ప్రాజెక్టు మంజూరు చేయడానికి ఓఎన్జీసీ అధికారులు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కార్యాలయంలో ఓఎన్జీసీ అధికారులతో పలు సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. రాజోలు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో వారం రోజుల్లో సమావేశం నిర్వహించడానికి ఈసమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ఓఎన్జీసీ ఈడీ ఎసెట్ మేనేజర్ శాంతనుదాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

మండపేట, అక్టోబరు3: స్థానిక 26వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ అమలదాసు లక్ష్మీ గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సమక్షంలో స్థానిక టీడీపీ కార్యాయంలో గురువారం వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరారు. ఆమెఅనుచరులు కూడా టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి 23మంది విజయం సాధించారు. ఇప్పటి వరకు ఆరుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. అమలదాసు రుద్రమూర్తి, బుల్లేశ్వరరావు, సోసయ్య, అన్నవరం, మురళీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, టీడీపీ కౌన్సిలర్లు యరమాటి గంగరాజు, కోవ్వాడ బేబి, మందపల్లి దొరబాబు, వాసా రవికిరణ్, యలమంచిలి శ్రీను, జొన్నపలి సూర్యారావు, బొచ్చా నరసింహమూర్తి పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి రూ.కోటి నిధులు

మండపేట, అక్టోబరు 3: మండపేట రథం గుడి అగస్త్యేశ్వరస్వామివారి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. గురువారం స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేగుళ్లకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

రూ.5లక్షల పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, అక్టోబరు 3: పసలపూడిలో పీడీఎస్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన జి.వెంకన్నకు చెందిన షెడ్‌పై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. టాటాఏస్ వాహనంలో 65బ్యాగ్స్ (3,185 కిలోలు) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.5,46,419 ఉంటుందని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, విజయ్‌కుమార్, కిషోర్, లోవరాజు, సీఎస్‌డీటీ అలిషా తదితరులు పాల్గొన్నారు. గుమస్తా ర్యావడ వీరబాబు సహాయంతో రామచంద్రపురానికి చెందిన నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి వివిధ ప్రాంతాల్లో కిలోరూ.20కి కొనుగోలుచేసి జి.మామిడాడ పరిసర ప్రాంతాల్లో చేపల చెరువులకు రూ.23కి విక్రయిస్తున్నారని విజిలెన్స్ రీజనల్ ఇన్‌చార్జి ఎస్పీ ఎం.స్నేహిత తెలిపారు.

విజయభేతాళస్వామి ఉత్సవాలు

అంబాజీపేట, అక్టోబరు3: విజయదశమి సందర్భంగా అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసియున్న శ్రీవిజయభేతాళస్వామి ఉత్సవాలకు కలశస్థాపన గురువారం వైభవంగా జరిగింది. శ్రీశెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాన్ని మాచవరం దుర్గాక్షేత్రం నుంచి ప్రారంభించి పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక సెంటర్‌లో యువకులు ఉత్సాహంగా చేడీతాలింఖానా నిర్వహించారు. కూరగాయలను కత్తులతో కట్ చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు పాల్గొన్నారు.

జెడ్.మేడపాడు సర్పంచ్‌కు అవార్డు



మండపేట, అక్టోబరు 3: జెడ్.మేడపాడు ఓడీఎఫ్ గ్రామంగా ఎంపికైంది. గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటికి తాగునీటి కుళాయిలు తదితర పనులతో గ్రామానికి జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ చెప్పారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డీఆర్‌వో నుంచి అవార్డు, ప్రశంసాపత్రాన్ని ఆయన అందుకున్నారు. అవార్డు రావడానికి కారణమైన పంచాయతీ సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రిపబ్లికన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం, అక్టోబరు 3: రిపబ్లికన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ముమ్మిడివరంలో ఘనంగా జరుపుకున్నారు. పోలమ్మ చెరువుగట్టున ఉన్న బుద్ధ పార్కులో ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్పీఐ కన్వీనర్ పంతగడ నరసింహమూర్తి, రిపబ్లికన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి అంబేడ్కర్ విగ్రహానికి పూమాలలువేసి నివాళులర్పించారు. సమావేశంలో దడాల రామృకష్ణ, సీహెచ్ శ్రీనివాస్, చీకురుమెల్లి చిరంజీవి, టి.వెంకటేశ్వరరావు, బడుగు సత్యనారాయణ, కె.వెంకటరమణ, మోకా సత్తిబాబు, యడ్ల చిట్టిబాబు, ఎన్.అబ్బులు, యలమంచిలి సురేష్, రేవు శ్రీను పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా జగన్మోహనరావు



అంబాజీపేట, అక్టోబరు3: అంబాజీపేట సబ్‌రిజిస్ట్రార్‌గా యు.జగన్మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. రామచంద్రపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. లేఖర్లు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు విజయప్రసాద్‌కు ఆహ్వానం



మామిడికుదురు, అక్టోబరు 3: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు మామిడికుదుర దీప్తి డిగ్రీ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయసత్యప్రసాద్ యర్రంశెట్టికి ఆహ్వానం అందింది. నవంబరు 3 నుంచి 8 వరకు జరిగే నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్-2024 అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందినట్టు ఆయన గురువారం తెలిపారు. ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో రచించిన పలు పుస్తకాల అనుభవం ఈఎంపికకు దోహదం చేసినట్టు తెలిపారు.

మత్స్యకారుల ఖాతాల్లోకి ఓఎన్జీసీ పరిహారం

యానాం, అక్టోబరు3: యానాంలో మత్స్యకారులకు ఓఎన్జీసీ నుంచి రావలసిన రెండో విడత పరిహారం 9నెలలకు 5,289మందికి నెలకు రూ.11,500 చొప్పున రూ.54.74కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమ అయినట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గడువు కంటే ముందుగానే పరిహారం జమచేసినందుకు ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్, హెచ్ఆర్ హెడ్ సునీల్ కుమార్, ఫైనాన్స్ హెడ్ కళ్యాణ్ చక్రవర్తి, హర్ష, సహకరించిన అందరికి మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రంగసామితో మల్లాడి ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ నుంచి అనుమతులు తీసుకుని మత్స్యకారుల ఖాతాలో వారం లోపు నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టినట్టు మల్లాడి తెలిపారు.

కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆత్రేయపురం, అక్టోబరు3: ర్యాలి దుర్గమ్మ ఆలయం వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. స్థానికులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. గురువారం డీఈ రాజేంద్ర, జేఈ మణికుమార్ రహదారిని పరిశీలించారు. స్లూయిజ్ వద్ద రోడ్డు విస్తరించి ప్రమాదాలు నివారించడంతో పాటు రోడ్డుకు ఆధునికీకరించి కొత్తవంతెన నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవిజయదుర్గ అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

కపిలేశ్వరపురం, అక్టోబరు 3: స్థానిక శాలిపేట వద్ద పెద్దకాలువ గట్టున కొలువై యున్న శ్రీవిజయదుర్గ అమ్మవారికి గురువారం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సత్య కుమారుడు, కోడలు కొప్పిశెట్టి లక్ష్మణ్ కిషోర్, బిందురాజ్యలక్ష్మి అమ్మవారికి కిలో బరువు గల రూ.80వేలు విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. అర్చకులు కాలధరి కార్తికేయ శీలం వెంకటరమణ, శ్రీదేవి దాత దంపతులతో పూజలు నిర్వహించి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, భవానీ మాలదారులు పాల్గొన్నారు.


ఆలయానికి మైకు, సౌండ్‌సిస్టమ్ బహూకరణ

అంతర్వేది, అక్టోబరు3: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.1.50లక్షల విలువైన మైకు, సౌండ్‌సిస్టమ్‌ను కువైట్ అగ్నికుల క్షత్రియ యువ పల్లవ సేనా సంఘం సభ్యులు బహూకరించారు. ఏసీ సత్యనారాయణ, సూపరింటెండెంట్ విజయసారథి, యువపల్లవ సేనాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

బ్యాగ్‌లో నగదు, వస్తువులు చోరీ

ముమ్మిడివరం, అక్టోబరు 3: మహిళ బ్యాగులోని నగదు, బంగారపు వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. విశాఖపట్నం కాకాని నగర్‌కు చెందిన గంగ్రోతు లక్ష్మి అనాతవరం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో మార్చి నెలలో రెండు దఫాలుగా రూ.7లక్షలు, రూ.5లక్షలు అప్పు తీసుకుంది. అప్పు తీర్చేందుకు ఐ.పోలవరం మండలం కొమరిగిరికి చెందిన మేనమామ ఆకుల వెంకటరెడ్డి ఇంటికి గత నెల 30న వెళ్లింది. అతడి వద్ద రూ.7లక్షలు అప్పు తీసుకుంది. రూ.7లక్షలు, ఏడు గ్రాములు బంగారపు చెవి జూలర్లు, రెండు కాసుల ఎర్రపూసల నక్లెస్, నాలుగు ఇత్తడి గాజులను హ్యాండు బ్యాగులో పెట్టుకుని ఈనెల1న మేనల్లుడు వీరవెంకటసతీష్ మోటారుసైకిల్‌పై మురమళ్ల మాణిక్యాంబ గుడి సెంటర్‌కు వచ్చింది. అక్కడి నుంచి ఆటోలో అనాతవరం బ్యాంకు దగ్గరకు వెళ్లింది. బ్యాంకు దగ్గర హ్యాండ్ బ్యాగ్‌ను ఆమె చూసుకుంది. రూ.1.50లక్షలు, బంగారపు వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం మృతి



అంతర్వేది, అక్టోబరు3: కేశవదాసుపాలెం హైస్కూలు హెచ్ఎం సీహెచ్ సుజాత(55) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కేశదాసుపాలెం ప్రధాన రహదారి వద్ద గుంటను తప్పించబోయి ప్రమాదానికి గురవ్వడంతో ఆమెను కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె మృతి చెందినట్టు భర్త పాటి రాజు తెలిపారు. ఆమె అవయవాలను ప్రభుత్వ జీవంధార్ పథకానికి దానం చేసినట్టు భర్త తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీవీమెరక వెలంకాయల కాల్వగట్టుకు చెందిన ఆమె మృతి తీరని లోటని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

కాట్రేనికోన,అక్టోబరు3: కొత్తపాలెంలో గురువారం పోలీసులు బెల్టు షాపుపై దాడి చేశారు. పది మద్యం ఫుల్ బాటిల్స్, పది బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని మల్లాడి వెంకటేశ్వరరావును అరెస్టుచేసినట్టు ఎస్ఐ ఐ.అవినాష్‌తెలిపారు.